క్లుప్తంగా

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం


ఉపాధ్యాయులతో విద్యార్థులు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి చక్కగా పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయులుగా అశ్విని, డీఈఓగా రోజా, కలెక్టర్‌గా జాహ్నవి, ఎంఈఓగా ప్రణీత్, మరికొందరు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శశికళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతకు సన్మానం


సునీతకు అభినందనలు తెలుపుతున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సునీతను శుక్రవారం రాష్ట్ర పంచాయతీ రాజ్ సంఘం అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, మండల పీఆర్టీయూ అధ్యక్షుడు పరమేష్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఐలయ్య, నరేందర్, భగీరథ సన్మానించారు. రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని నూతన తహసీల్దార్ అన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

మాడ్గుల: మాడ్గుల మండలం కోలుకులపల్లిలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులకు సంబంధించి గ్రామానికి చెందిన బట్టు సంగ్రామ్ రెడ్డి లక్ష రూపాయలు విరాళం అందించారు. కోలుకులపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బట్టు అనురాధకు బట్టు సంగ్రామ్ రెడ్డి ఈ విరాళాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో కోలుకులపల్లి ఎంపీటీసీ సభ్యుడు బట్టు కిషన్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన తరగతులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో శుక్రవారం ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించారు. ఎంఈఓ సర్దార్‌నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మణ్ ఎస్ఎస్‌సీ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, జెడ్పీటీసీ అనురాధ, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు రాము, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై కరపత్రాల పంపిణీ

యాచారం: నరేంద్రమోదీ పాలనపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. పల్లెకు పోదాం అనే కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి నక్కర్తమేడిపల్లి గ్రామంలో బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించి అక్కడే బస చేశారు. బీజేపీ శ్రేణులతో కలిసి శుక్రవారం ఉదయం గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించి కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలపై అవగాహన

ఇబ్రహీంపట్నం: పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు శుక్రవారం ఇబ్రహీంపట్నంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ మోటివేటర్ లక్ష్మణ్ పాల్గొని పరీక్షలపై పదో తరగతి విద్యార్థులకు ఉన్న భయాందోళనలు తొలగించేవిధంగా వివరించారు. ఏకాగ్రతతో చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు.

ఆమనగల్లు సీఐగా విజయ్‌కుమార్

ఆమనగల్లు: ఆమనగల్లు పోలీసు స్టేషన్‌కు నూతన సీఐగా విజయ్‌కుమార్ వచ్చారు. ఇంతవరకు ఆమనగల్లు సీఐగా పనిచేసిన వెంకటేశ్వర్లు వారం రోజుల క్రితం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రస్తుతం సైబర్ క్రైంలో సీఐగా పనిచేస్తున్న విజయ్‌కుమార్ ఆమనగల్లు సీఐగా బదిలీ అయ్యారు. రెండు మూడు రోజుల్లో సీఐ విజయ్‌కుమార్ బాధ్యతలు తీసుకుంటారని సమాచారం.

ఎండుముఖం

- అడుగంటుతున్న భూగర్భజలాలు
- ఎండిపోతున్న వరి పంట
- ఆందోళనలో రైతన్న

మంచాల: వేసవి ఎండలు ఇంకా ముదరనే లేదు.. అప్పుడే వరి పంటపొలాలు ఎండుముఖం పడుతున్నాయి. ఈ యేడాది ఈశాన్య రుతుపవనాలు అనుకూలించకపోవడంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదు. దీంతో పంటచేలు ఎండిపోతుండటంతో రైతన్నలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంచాల మండలంలో 32వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా అందులో 23వేల ఎకరాలు మాత్రమే సాగుకు అనుకూలమైంది. ఇక్కడ ప్రతి ఏటా యాసంగిలో 7,500 ఎకరాలకు పైగా వరి పంట సాగు చేస్తుంటారు. ఈసారి మాత్రం కేవలం 4,100 ఎకరాలు మాత్రమే సాగుచేశారు. దీంతో ఒక్కసారిగా 40శాతానికి పైగా వరిపంట సాగు పడిపోయింది. దీనికి తోడు తీవ్ర ఎండలతో మండలంలోని మెజార్టీ పొలాల్లో వరి పంట పొలాలు ఎండిపోతున్నాయి.

తగ్గిన భూగర్భ జలాలు...

మండలంలో గతంలో 350–500 అడుగుల లోతుకు బోరువేస్తే కచ్చితంగా నీళ్లు వచ్చేవి. ప్రస్తుతం 750 నుంచి 1000 అడుగుల లోతుకు బోర్లు వేసినా చుక్కనీరు రావడం లేదు. ఇలా గ్రామాల్లో భూగర్భ జలాలు ఒక్కసారిగా తగ్గిపోయాయి. నిన్నటివరకు మంచిగా పంట పొలాలకు నీరందించిన బోరు బావులు సైతం పూర్తిగా ఎండిపోతున్నాయి. కనీసం పాడిపశువులకు కూడా తాగునీరు అందించడం లేదు. దీంతో అప్పులు చేసి బోర్లు వేసిన రైతులు పంటచేలకు నీరందకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసిన పంటచేలు ఎండిపోయే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఆరుట్లలో నీటితడులకు నోచుకోని వరిపంట

విద్యుత్ సమస్య లేదు



గ్రామాల్లో బోరు బావుల్లో నీళ్లు తగ్గిపోవడంతో మోటార్లు పాడైపోతున్నాయి. విద్యుత్ సరఫరాలో ఏలాంటి లోపాలు లేవు. నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నాం. ప్రస్తుతం లోఓల్టేజి సమస్య కూడా లేదు.

– సత్యనారాయణ. ఏఈఈ, మంచాల


జాపాలలో 750 అడుగుల లోతుకు వేసిన బోరు

అప్పుచేసి సాగుచేశా



ఈ యేడాది అప్పు చేసి వరిపంట సాగు చేశాను. అయితే వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు ఎండిపోతుండంతో బోరుబావులు వట్టిపోతున్నాయి. దీంతో పొలాలు ఎండిపోతున్నాయి. వేసవి ఎండలు ముదరక ముందే ఇలా ఉంది. ముస్ముందు మరింత పంటచేలు ఎండిపోయే ప్రమాదం ఉంది.

– భాస్కర్, ఆరుట్ల

సాగు గణనీయంగా తగ్గింది



వాస్తవంగా ఈయేడాది వర్షాలు సమృద్ధిగా పడలేదు. దీంతో వరిపంట సాగు గణనీయంగా తగ్గిపోయింది. భూగర్భ జాలాలు తగ్గిపోవడం మూలంగా పంటచేలు ఎండిపోయే ప్రమాదం ఉంది. గ్రామాల్లో పరిశీలన కూడా చేస్తున్నాం.

– జ్యోతిశ్రీ, వ్యవసాయాధికారి, మంచాల

రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

తలకొండపల్లి: గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి, నిధులు మంజూర్ చేసిందని పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2.85 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. మండల పరిధిలోని 54 సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఈ నిధులను కేటాయించిందని తెలిపారు. ఒక్కో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున నిధులు కేటాయించారన్నారు. మండలంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, యాదగిరి, డీసీసీ కార్యదర్శి రవీందర్‌యాదవ్, ఎస్సీసెల్ మండల చైర్మన్ చెన్నకేశవులు, నరేష్, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఆరోగ్యంపై అవగాహన అవసరం

గౌతమి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి రజనీకాంత్

కడ్తాల్: గౌతమీ ఫౌండేషన్, ది గర్ల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో, శుక్రవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు మండల పరిధిలోని గానుగుమార్లతండాలో బాలికలకు, మహిళలకు సానిటరీ ప్యాడ్ వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గతమి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి రజనీకాంత్ మాట్లాడుతూ.. నేటి ఆహారపు అలవాట్లు, జీవనశైలి తదితర కారణాల రీత్యా చిన్న వయసులోనే బాలికలు రుతుక్రమ సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. బాలికలు వారి సమస్యలను ఎవరికి చెప్పాలో అర్థంకాని అయోమయ స్థితిలో ఉన్నారని, అలాంటి వారికి సలహాలు, సూచనలు అందించడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. అందులో భాగంగానే బాలికలకు గౌతమి ఫౌండేషన్, గర్ల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం ది గర్ల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు రోహిణి నాయుడు విద్యార్థులకు, గ్రామస్తులకు శానిటరి ప్యాడ్స్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు, గ్రామస్తులకు శానిటరీ ప్యాడ్స్‌ను నిర్వాహకులుఉచితంగా అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సానిటరీ ప్యాడ్స్ అందజేసిన నిర్వాహకులు

బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పిస్తాం

ఎంపీపీ కొప్పు సుకన్య


యాచారం బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ సుకన్య, అధికారులు

యాచారం: ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తామని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను శుక్రవారం ఎంపీడీఓ నరేందర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటనర్సప్ప, యాచారం విద్యుత్ ఏఈ సందీప్‌కుమార్, మిషన్ భగీరథ ఏఈ పాషతో కలిసి ఆమె సందర్శించారు. 20 ఏళ్ల పాటు వృథాగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ మహాలక్ష్మీ పథకం పుణ్యాన వాడకంలోకి వచ్చింది. అయితే బస్టాండ్‌లో అనేక సమస్యలు ఉన్నాయి. విద్యుత్ లైట్లు, శుభ్రత లేకపోవడం, మరుగుదొడ్లు, మూత్రశాలలు వాడుకలో లేకపోవడం, తాగునీటి వసతి, సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ అన్నిశాఖల అధికారులను పిలిపించి బస్టాండ్‌ను సందర్శించి ప్రయాణికుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. త్వరలో మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సౌకర్యం కల్పిస్తామని, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తామని అధికారులు ఎంపీపీకి తెలిపారు. నీటి సరఫరాతో వాడకలో లేని మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రం చేయించి ప్రయాణికుల సమస్యలు తీరుస్తామని అధికారులు హామీ ఇచ్చారు. బస్టాండ్‌లో సీసీ రోడ్డు నిర్మాణ కోసం కావాల్సిన నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలియజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ...ఆర్టీసీ బస్టాండ్‌లోకి వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. సాగర్ రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రతి బస్సు యాచారం బస్టాండ్‌లోకి వచ్చిపోయేలా కృషి చేస్తామని ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకట నర్సప్ప తెలిపారు. బస్టాండ్‌లో నిత్యం ఆర్టీసీ సిబ్బంది ఉండేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

నూతన కమిషనర్‌కు సన్మానం

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్‌గా వసంత పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా ఉన్న శ్యాంసుందర్ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు బదిలీకాగా జిల్లాలోని జల్‌పల్లి మున్సిపాలిటీ నుంచి వసంత బదిలీపై ఆమనగల్లుకు వచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో నూతన కమిషనర్ వసంతను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ సత్కరించారు. కౌన్సిలర్లు యాదమ్మ, లక్ష్మణ్, విక్రంరెడ్డి, గీత, శ్రీశైలం యాదవ్, నర్సింహ తదితరులు ఉన్నారు.


వసంతను సత్కరిస్తున్న నాయకులు

ప్రభుత్వాస్పత్రి స్థాయి పెంచాలి

- భూములు కోల్పోయిన వారికి పరిహారం
- కాలేజీ భవన నిర్మాణం పూర్తిచేయాలి
- అసెంబ్లీలో కోరిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి



ఆమనగల్లు: నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న ఆమనగల్లు పట్టణంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వాస్పత్రి స్థాయిని పెంచాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాలలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. పట్టణంలో జూనియర్ కళాశాలకు భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, రెండేళ్ల క్రితం భవన నిర్మాణ పనులు ప్రారంభించినా కోర్టు వివాదం కారణంగా పనులు నిలిపివేశారని వివరించారు. భూ వివాదం పరిష్కరించి భవనం నిర్మించాలని లేదంటే మరో అనుకూలమైన స్థలంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఆమనగల్లులో ఉన్న 30 పడకల ప్రభుత్వాస్పత్రి స్థాయిని గత ప్రభుత్వం తగ్గించి పది పడకలుగా మార్చిందని దీంతో వైద్యులు అందుబాటులో ఉండక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఆస్పత్రి స్థాయిని పెంచి మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పేరు ఉన్నప్పటికీ కల్వకుర్తికి మాత్రం నీరు రావడం లేదని ఎమ్మెల్యే సభ దృష్టికి తీసుకువచ్చారు. 2017లో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ82 కాలువ నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ.178 కోట్లు కేటాయించగా రూ.160 కోట్లు ఖర్చు చేసి కాలువ నిర్మించిందన్నారు. వెల్దండ మండలంలో ఓ రైతుకు పొలంలో ఉన్న టేకు చెట్లకు రూ.5 లక్షలు చెల్లించకపోవడంతో పనులు అక్కడ నిలిచిపోయాయని, ఆరేళ్లుగా అలాగే ఉండిపోయిందని కాలువ పూర్తి కాక సాగునీరు రాక రైతులు అవస్థలు పడుతున్నారని ఆయన చెప్పారు. అంతేకాకుండా కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నేటికీ నష్టపరిహారం అందలేదని వెంటనే రూ.40 కోట్లు విడుదల చేసి రైతులకు పరిహారం అందించాలని ఆయన కోరారు. దీనికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమాధానం ఇస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకుపోతామని చెప్పారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మంచాల: మండల పరిధిలోని ఆరుట్లలో ఈనెల 22 నుంచి 26 వరకు శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీటీసీ సభ్యుడు చీరాల రమేష్, కావలి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ఆరుట్ల శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ బాలశంకర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేటశ్, మాజీ ఉప సర్పంచ్, మండల బీజేపీ ఇన్‌చార్జి జంగయ్యగౌడ్, వివిధ సంఘాల నాయకులు జనార్దన్‌రెడ్డి, సుంకరి పాండరి, యాదయ్య, శ్రీశైలం, పున్నం రాము, కృష్ణ, రమణారెడ్డి, వెంకట్‌రెడ్డి, భాషయ్య, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


తలకొండపల్లి: కల్యాణోత్సవంలోని ఓ ఘట్టం


ఆమనగల్లు: రథానికి పూజలు చేస్తున్న సత్యం

ఘనంగా చెన్నకేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్ శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఆలయ నిర్వాహకులు శ్రీ వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో కల్యాణ వేడుక వైభవంగా జరిగింది. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ యాదయ్య, మాజీ సర్పంచ్ కిష్టమ్మ, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా తలకొండపల్లిలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో ఆ స్వామివారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు.

ఆమనగల్లు పట్టణంలో

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో శుక్రవారం వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. నాయకులు కాలె మల్లయ్య, యాట ముత్యాలు, జగన్, యనమల రమేష్, ప్రకాశ్, శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

ఆమనగల్లు మండలం శెట్టిపల్లిలో శ్రీ అలివేలు మంగాసమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం రథోత్సవాన్ని నిర్వహించారు. అంతకుముందు రథం వద్ద మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి సత్యం ఆధ్వర్యంలో అర్చకులు నవీన్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● నిరసన గళం

కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం నిర్వహించిన దేశవ్యాప్త సమ్మె విజయవంతం అయ్యింది. కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో సీఐటీయూ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, మున్సిపల్, మధ్యాహ్న భోజన కార్మికులు, హమాలీలు, వివిధ సంఘాల నేతలు ర్యాలీలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్


మంచాల: ఆరుట్లలో వామపక్ష నేతల నిరసన


ఆమనగల్లు: ర్యాలీలో మాట్లాడుతున్న రైతుసంఘం నేత మధుసూదన్‌రెడ్డి


హయత్‌నగర్: రోడ్డుపై బైఠాయించిన ఏఐటీయూసీ నాయకులు


ఇబ్రహీంపట్నం: ర్యాలీ తీస్తున్న కేవీపీఎస్, రైతు సంఘం నేతలు

అడవులను కాపాడుకుందాం

ఇబ్రహీంపట్నం: పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే వృక్ష సంపదను పెంచుకోవాలని వర్చూసా కంపెనీ ప్రతినిధులు అవిజిత్ ఛటర్జీ, పూజ ప్రకాష్ లాల్ అన్నారు. స్థానిక గురునానక్ విద్యాసంస్థలో వృక్షో రక్షతి రక్షితః కార్యక్రమంలో భాగంగా వర్చూసా సహకారంతో శుక్రవారం 2500 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాతావరణం సమతుల్యంగా ఉండాలంటే 33 శాతం పచ్చదనం తప్పనిసరన్నారు. అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ నుంచి వసీం ఆక్తర్, గురునానక్ విద్యాసంస్థల చైర్మన్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, ఎండీ హెచ్ఎస్ సైని, కార్పొరేట్ రిలేషన్స్ వినయ్ చోప్రా, డైరెక్టర్ వెంకటరావు, ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డి, జాయింట్ డైరెక్టర్ పార్థసారథి, విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న అతిథులు, విద్యార్థులు